ప్పుడు రేవతి క్షమిస్తుందో లేదో అన్న కలవరంతో వణుకుతున్న పాపిలా రాజమ్మా, పాపిని క్షమించేనన్న గర్వంతో నిల్చున్న పార్వతీదేవిలా మిసెస్ అరవింద వున్నారు.

"రా, కారులో పంపుతాను. గవర్నమెంటాసు పత్రికి" అంటూ ఆమె రాజమ్మని నడిపించుకొని తీసు కొని పోయి, మళ్ళీ రెండు నిమిషాల్లో తిరిగొచ్చేసింది.

ఆమె మంచితనాన్ని మెచ్చుకున్నారు అక్కడి మంచివాళ్ళు. ఆమె tact ని మెచ్చుకున్నారు వృద్ధిలోకి రావలసిన వాళ్ళు.

బైట రాత్రి మొహం తెగిన మనిషిలా భయంకరంగా వుంది.

ఏం చెప్పినాపార్టీ మూడ్ పాడైపోయింది. అంతచేత వెంటనే భోజనాలకి కూర్చున్నారంతా. ఇంకా మొదటి కోర్సు పూర్తవ నేలేదు.

ఈలోగా మంత్రాన్ని వదలించుకొని వచ్చిన పిశాచిలా రాజమ్మ వచ్చి ద్వారంలో నిల్చుంది.

ఆమె చీర రక్తం మరకలువున్న చోటల్లా చిరిగి పోయినట్టుంది.

ఆమె ఆత్మ చిరిగిపోయిన మనిషిలా ఉంది. ఆమె కళ్ళు గేదెడు రక్తం తాగి ఇంకా కావాలని ఆజ్ఞాపించే అమ్మవారి కళ్ళల్లా జేవురించి వున్నాయి. ఆమె ముక్కు కాటేయబోయే పాము పడగలా ఎత్తుగా పొంగింది. ఆమె కడుపులో మంటకి కన్నీళ్ళు ఆవిరైపోయేయి.

కన్నతల్లినైనా చంపడానికి సిద్ధంగా ఉన్న మనిషిలా పిచ్చి ఆవేశంతో ఊగిపోతూందామె.

డాక్టరు అరవిందని చూడగానే ఆమె అతని వైపు యీనిన పులిలా పరిగెత్తుకెళ్ళి కోటు కాలరు పట్టుకొని ఎముకలన్నీ విరిగేటట్టు గింజింది. అప్పుడు ఆమెను ఆపడానికి అక్కడు వున్న ఎవరూ తెగించలేదు.

"సూడు. బాగా సూడు. నేను నీ 'ఎన్నెల పువ్వుని' 'ఎండిన తీగెని' నన్ను మరిసి పోయిండొచ్చు. కానీ కూతుర్నెలాగ మరిసి పోనావు? దాన్ని పస్తులు పెట్టేవు. పడుసుకోనిచ్చేవు.

మీకాడే నేయం వుంటేనీ పక్కల కూచోనుండాల ఆ గుంటి ప్పుడు. మీకాడే దరమంవుంటే నీ యాస్తిలో వోటా వుండాల దానికి.

కానిమీరుగొప్పోళ్ళు. మీకు నేయంవొద్దు. దరమం వొద్దు. మీరంటే బగమంతుడుకూడా జడిసిపోతాడు.

కాన్నేను బీదముండని. బజారు నంజని. నాకు దేవుఁడంటే బయంవుంది. నేను సచ్చేక 'ఆ బాబు పరువెందుకు బైటెట్టేవ్? అని బగమంతు డడుగుతా దేమోనని బయట పడిపోయి నీ వూసుకి రానేదు. కడుపులు మండిసచ్చినాంవేఁగాని, కానీ యిమ్మని సెయ్యిజాపలేదు తల్లీ కూతుళ్ళం. కార్లో తిరగాల్సిన కూతురు కారుస్టేండులో పడుసుకుంటూంటే సూస్తూ వూరు కున్నా, మా రాణిని కావాలనే ముష్టిదాన్ని సేసేరు.

నువ్వు దాని బాబువనికూడా తెలనివ్వలేదు.

నా నీతి నాకుంది.

నా దరమం నేన్నిలబెట్టుకున్నాను.

బతికినన్నాళ్ళు పచ్చి మంచినీళ్ళు నిన్నడగ లేదు. కాని సచ్చి నీ పంచనపడుంది. సూసుకో నీ కూతుర్ని.

ఆకిరికి దానిబాబుగా కాకపోయినా, మనిసిగా వొయిద్దెం సేసుంటే అది బతికేది, దారిమద్దెల కుక్కసావు సచ్చీదికాదు.

నువ్వు తండ్రివికావు. రాచ్చసుడివి.

నువ్వు మనిసివికావు మహామారివి.

అని అందామని ఆమెకు ఎంతో అన్పించింది. కాని కిలకిల చుట్టుకుపోతున్న పేగుల్లోని కోరిక చేత్తోపట్టుకొని "సీ! నిన్ను తిడుతే ఓటీ, కుక్కని తిడుతే ఓటీకాదు" అని వెళ్ళిపోయింది.

**(1968)**

# తప్పు

**కో**రలున్న ఈ రాత్రి చిక్కగా నిలబడిపోయింది. సత్యనారాయణ జీవితంలో అనేక రాత్రులు గడిచేయి. కాని ఈ ప్రళయ రాత్రిలో ఒక భయంకరమైన ప్రత్యేకత ఒక అనిర్వచనీయమైన భయం తోడుకొని పేరుకున్నాయి. ఈ భారమైన రాత్రి తొలగిపోవాలి. ఇనప తెరలాంటి ఈ దళసరి చీకటి కరిగి పాలలాంటి వెలుగు ప్రవహించాలి. అప్పుడే సత్యనారాయణకి మోక్షం. జీవితపు చీలిక బాటలమధ్య చేరిన సత్యనారాయణకు ఈ రాత్రే ఒక భావి– ఒక బాట నిర్ణయిస్తుంది. అతని జీవితనౌక ఈ పెను తుఫాను తప్పిం చుకొని దరిజేరడమో, లేక ఈ సుడిగాలిలో విరిగి చెక్కలై పోవ డమో ఈ రాత్రే నిర్ణయిస్తుంది. ఈ రాత్రి నికమోయలే ననుకుం టున్న సత్యనారాయణ చీకటి ఎడారిలో సాగిపోతూనే వున్నాడు.

"ఈ సీకట్లో నే(నాలే(నా సత్తుం, టేశనుకెళ్ళి నువ్వే సూసు కురా" అన్న రాజమ్మ మాటలు అతన్ని వెంబడిస్తూనే వున్నాయి. రైలుస్టేషన్లో ట్యూబులైట్లన్ని కలిసినా అతన్ని అలుముకుంటున్న చీకటిని చింపలేవు. ప్రపంచంలోని అన్ని రైళ్ళూ ఒక్కసారి కూసినా అతని హృదయ ఘోషని మించలేవు.

ముందుకు దూసుకుపోతున్న సత్తెన్నారాయణ మనసులో జీవితపు పుటలు వెనక్కు తిరుగుతున్నాయి.

ఐదేళ్ళకింద పలుచని వెన్నెల్లో, నిర్జీవమైన హరికెన్ లాంతరు ఎర్రవెల్తుర్లో, మునసబు రావఁయ్య యింటిముందు, ఆశ ఫలించగా వచ్చిన నీరసంవల్ల గోడకు చేరబడిపోయిన రాజమ్మను "మరైతే ఏం చేస్తావే నీ మనవణ్ణి?" అని రావఁయ్య అడిగేడు. భయంతో గోడకు కరుచుకుపోయిన సత్తెన్నారాయణ యింకా గోడలోకి పొదుక్కుపోయేడు. జీవిత ప్రవాహంలో సునాయాసంగా కొట్టుకుపోవడమో, లేక తిరగబడి ఎదురీదటమో నిశ్చయించుకోలేని రాజమ్మ పెదవి విడలేదు.

"నీ కేంవేఁ! చదివించు పైకి" ప్రోత్సహించేడు రావఁయ్య, ఐనా మాటాళ్లేదు రాజమ్మ. దాంతో మరీ ఉత్సాహంతో, "చదివించు పైకి. నీకైనా ఏ వంత పదిమందున్నారనీ? మిగిల్నవాడల్లా వాడొక్కడేగా? చదివిచ్చదివించు" అని మొండిగా ప్రోత్సహించేడు రావఁయ్య.

దాంతో రెచ్చిపోయింది రాజమ్మ. "ఏటి సెప్పను మునిసిబ్బాబూ? నాబతుకిలా మండిపోద్దనుకోలేదు. కట్టుకున్నోణ్ణి కాల్చేసుకున్నా, కన్న కూతుర్ని కాల్చేసుకున్నా. ఇందరు సచ్చినా నాకు సావురాలేదు. నా కోసరం కాదు బాబూ నేబతికేది మిగిలున్న ఆ నలుసు కోసరం" అని ఆగింది, ఆప్యాయత్తో సత్తెన్నారాయణ్ణి చూస్తూ. మళ్ళీ కట్టుకున్నవాడు జ్ఞాపకం రాగానే "ఆడికేం ఆడు పోనాడు, నా మెళ్ళకీ బందాలన్నీ సుట్టేసి. ఆడుసేసిన అప్పులే తీరసమంటావా? మిగిల్నొక్కడికీ అచ్చరముక్కే సెప్పించమంటావా? నువ్వే సెప్పు! ఇంతకీ యీడు సదువుకునేటి సేస్తాడంటావ్? ఉద్దేగాల్సేస్తాడా? ఊళ్ళేల్తాడా? నా నీదనేను మునసబ్బాబూ యీ మొండిబతుకు. ఏటుందని సెప్పించమంటావ్ సదువు. ఏటుందని సెప్పించనీడికి సదువ్? నీకు తెలన్దేటుంది గనుక? కమిసను కొట్టుకి బెల్లం తోల్నేదని సెప్పి సావుకోరు ఒడ్డీలకి ఒడ్డీలు కట్టినాను. పేగుల్నింపుకుని కట్టిన సెల్లులు సూపక కోరటు కీడ్సివాడు. ఆడి జివ్వఁడ– ఆడి కెలా అరుగుద్దో యీ అన్నేయపొర్జన. ఏటంటే ఏం నాబం? ఇపుడెం తేడ్సి ఏం నాబం? ఇయేలో రేపో ఆ తూరుప్పొలం డప్పుకొట్టి పొట్ట నెట్టేసుకుంటాడు సావుకోరు. ఇకేటి మిగులుద్ది నాకు? మూల పొలం ముప్పాతికా! అంతేనా! అందిమీదొచ్చేదేటి? నాకు మిగిలేదేటి? దాంట్లో నీకు పన్నులే కట్టమంటావా? కరణమయ్య కట్నాలే సదించమంటావా? బేపనయ్య బాకీలే సెల్లు పెట్టమంటావా? సత్తుకు సదువే సెప్పిచ్చమంటావా? ఇన్నీబోతే నాకేటి మిగులుద్ది. నువ్వే సెప్పు నాన్నగోరూ. ఎండుగడ్డీ ఏరుకున్నా గింజలూ తప్ప, ఏటుందని సత్తెన్ని కాలేజీలో ఎట్టమంటావ్?" ఆగిపోయింది రాజమ్మ.

నిలదీసి అడిగిన రాజమ్మను బుజ్జగించేడు రావఁయ్య. "మేమంతా లేఁవుటే? అట్నుంచి నరుక్కొద్దాం. లక్షణంగా చదువుకుంటున్న వాణ్ని మానిపిచ్చేస్తానంటా వేఁవిఁటే నువ్వు? వెనకాడక ముందు నువ్వు వాడిని కాలేజీలో చేర్చు, తర్వాత చూద్దాం. ఇంతకీ మా రాంబాబు కూడా తోడుంటాడుగా వాడికి, వాడేం ఒంటిగాడు కాదులే"

సత్తెన్నారాయణ ఎస్సెల్సీ పేసైన రాత్రి జరిగిన ఈ సంభాషణ అతన్ని తొట్రుపాటుతో కాలేజీలోకి నెట్టింది. తన పల్లెకి రెండుమైళ్ళ దూరంలో వున్న పట్టణంలో కాలేజీలో చేరేడతను.

నాలుగు నూలు చొక్కాలతో, మూడు చిరిగిన రంగు పంట్లాంలతో, రాంబాబు పుస్తకాలతో, మధ్యాన్నం మండే కడుపుతో, దినానికి నాలుగుమైళ్ళ నడకతో, జీవితంలో ఒంటరి తనంతో, పెరగని రాంబాబు పరిచయంతో పి.యు.సి.గడిచి పోయింది. రాంబాబు, సత్యనారాయణ ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యేరు.

ఆ సంవత్సరంలో సత్తెనారాయణ చూసిన సినిమాలు రెండు–అమెరికా గవర్నమెంటు ఖర్చుని. ఆ సంవత్సరంలో అతను కేంటీను కెళ్ళింది మూడు మాట్లు మూడు మాట్లూ రాంబాబు ఖర్చునే.

సత్తెనారాయణ పి.యు.సి. పేసయ్యేక ఎవరి సలహా లేకుండానే అతన్ని బి.యే.లో ప్రవేశపెట్టింది రాజమ్మ. బి.యే. ప్యాసైతే "సబిన్సపెట్రు పనిస్తారని యెవరో అనగా యెప్పుడో విందామె.

ఒకప్పుడు హేడ్ కానిస్టేబులుద్యోగం ఆమె దృష్టిలో బహు దొడ్డది. అల్లప్పుడు కలకత్తా మెయిల్‌కిందపడి చచ్చిపోయిన "మైన(రాజు గోరి" అంటు మామిడితోటలో, "కాలుజారిన" చిట్టెమ్మ కూతురు ఉరిపోసుకుని చచ్చిపోయినప్పుడు, చిట్టెమ్మని ఖైదులో

తోసిందీ హెద్దే. పదుచ్చుకు "ఒగ్గేసిందీ ఆ హెద్దుబాబే" అంచేత తల్చుకుంటే మూడు వందలు పుచ్చుకొని బైటకు తీసిందీ ఆ "ఏద్దుబాబే"

"సంకురాత్తిరి" పండక్కి "సుక్కెక్కు వేసుకున్న" మంగమ్మ మొగుణ్ని కబందుళ్ళాటి "కానిస్టేబు" పట్టుకుంటే తపస్సు మినహా హెద్దుకి చేతకాందేదీ లేదు రాజమ్మ దృష్టిలో కాని యిదంతా–

ఒకనాడు పాతబాకీ తీర్చనందుకు, తననికొట్టందే కొట్టేడని, తిట్టందే బూతుల్తిట్టేడనీ, ప్రమాదవశాత్తు తన పశువులపాక తగులడి పోతే కావాల్నే దానికి నిప్పు పెట్టేడనీ, బడ్డీకొటు బస వయ్య రౌడీ కోడిగాడిమీద "అబద్దీకపు తిపోరుటు" హెద్దు కిచ్చేడు. హెద్దు కూడా "సంచం కతికేసి న్నేయం అన్నేయం" అన్నది లేకుండా గొద్దుని బాదినట్టు కోడిగాడ్ని బాదేసి "ఎన్టీవోడి స్టంటులా" వాణ్ని కుళ్ళ బొడిచేస్తూ వుంటే, వాడు వేసిన కేకలు "సీతామ్మోరి దుక్కంనాగ" ఊర్పి "ఉడకబెట్టేసి నాయ్" ఆ కేకలికి "ఇనసపెక్టరు బాబు టేశనుకి పరిగెత్తి ఏడ్డు యీప్మీదీశ గుద్దోటి గుద్ది కోడిగాడ్ని యిడదీసీకపోతే కోడిగాడు ఆడి బాబుల్లో కలిసి పోయుండును," అంతే కాకుండా కోడిగాడి మాటిని, ఆడి నాయం కనిపెట్టేసి ఆణ్ని ఒగ్గేసి, తప్పుడు కేసిచ్చినందుకు బస వయ్య మీద కేసెట్టి ఆణ్ని జైలుకి కట్టేశాడు దరమరాజు ఇనస పెక్టరు బాబు"

ఈ వుదంతం కోడిగాడిముఖతః విన్నప్పట్నుంచీ రాజమ్మ దృష్టిలో "ఏడ్డు పొట్టేలైతే ఇనసపెక్టరుబాబు పులి. ఆదుపులైతే యీడు సింవం"గా మారి, కొండంత హెద్దూ ఆర్నెల్ల కింద చచ్చిన శవంలా శుష్కించి పోయేడు. ఇదంతా జరిగి "మొన్న కొత్తామాసకి నాలుగో ఏడు సొరబడ్డది." అప్పట్నుంచీ "సత్తుం" ఇనస్పెక్టరైతే ఈ "ఔతారం సాలించేద్దామని" రాజమ్మ అనుకుం దేది. ఆమె అలా అనుకున్న దాని ఫలితమే సత్తెన్నారాయణ బి.యే. చదువు.

సత్తెనారాయణ బి.యె. చదివిన మూడు సంవత్సరాల్లోనూ మూడుసార్లు ఆడపిల్లలు కోరుకొని అతన్తో మాటాడేరు, తమకేవో ఓట్లివ్వమ్మని. ఆ మూడు సంవత్సరాల్లోనూ అతన్తో ప్రిన్సిపాలు గారు రెండుసార్లు మాటాడేరు. మిగతా పిల్లలు చేసే స్ట్రయికులో పాల్గొంటే "ఫీ" కన్సెషను తీసేస్తామని చెప్పడానికి.

ఆ మూడు సంవత్సరాలూ రాజమ్మ చెమటోడ్చింది. ముసలి సంయుక్తలా నడుం బిగించింది. కత్తిపట్టిన ఝాన్సీ లక్ష్మిలా లక్ష్యసాధనలో తాను ఆహుతై పోడానికి సిద్ధపడింది.

ఆ మూడేళ్ళూ ప్రతిరోజూ చీకటున్నా వానొచ్చినా తెల్లవారు ఝామున మూడింటికి లేచేది. సంగీత సాధనకి మాత్రం కాదు. "కోసెడుదూరం స్మెసేనం మలుపు ఒరుకు" పోయి పేడఏరి తెచ్చి వారానికి "యెయ్యిరె బాబూ యెయ్యి" పిడకలు పెట్టి అమ్మి రోళ్ళిపోయేవరకూ తిప్పితిప్పి అమ్మి, దంపుడు బియ్యం దుకాణంలో "వోరానికి ఏడు బస్తాలు– రోజుకో బస్తా లెక్కని" దంపి దంపి, "జంక్సనుకాడ కేపీ దుకాణంలో" రోజుకి కుంచెడు మినపప్పు రుబ్బి రుబ్బి, అంట్లుతోమి, ఆగచాట్లుపడి, తాను సున్నమై ఎద్దుల్లో ఎద్దయి "బూ దేవత్తో కుమ్ములాడి," పండించు కున్న పదిగింజల్తో "సత్తుంని మూడు పూట్లకో పూట పస్తెట్టి," సత్తెన్నారాయణ్ని చదివించింది రాజెమ్మ.

సత్తెన్నారాయణకి సబిన్స్‌పెక్టరౌదామనీ, సూపరెంటౌదామనీ లేదు. కనీసం కలెక్టరౌదామనన్నా లేదు. అతనికి కోరికల్లేవు. వాంఛల్లేవు. భావిజీవితం గురించి గులాబీకలల్లేవు. అతనికున్న ఒక్క ఆశయంవూ:బియ్యే ప్యాసౌదామనే. తాను ప్యాసైతే రాజమ్మ కళ్ళల్లో నీటి ముత్యాలు చూద్దామనీ, ఆమె మొహంలో మెరిసే మెరుపులు చూద్దామని కూడా కాదు. తన పరీక్షపోతే ఆమె మొహం చూళ్లేడు. ఆమెకు తన మొహం చూపలేడు. తన పరీక్ష పోతే రౌడీవెధవ రామ చిలుక పీక పిసికేసినట్టూ వుం టుంది రాజమ్మకు. రాజమ్మ బాధ తను చూళ్లేడు. తనమట్టుకు తను పోషించుకోలేక కాదు. రాజమ్మక్కావలసిన "మూడు ముద్దలూ" సంపాదించ లేక్కాదు. పసిపిల్ల ఆడుకుంటున్న గాజు బొమ్మని తోలు జోడుతో తొక్కి పిండి చేసినట్టూ, యుద్ధానంతరం సైన్యంలోని తండ్రిరాక కెదురుచూస్తున్న పిల్లతో "మీనాన్న చచ్చి పోయేడని" చెప్పినట్టూ వుంటుంది, రాజమ్మతో తన పరీక్ష పోయిందని చెప్పడం. అంతకంటే తన పరీక్ష పోయిన పక్షంలో "సత్తుంబాబూ! నీ పరిచ్చపోతే నాను ఏటొడ్డు పొణ్నూతిలో పడాల్సిందేరా బాబూ" అని ఆమె అనే పాడు నూతిలో ఆమెని తోసేస్తే ఆమెపట్ల దయచూపిన వాడౌతాడు.

సత్తెన్నారాయణెప్పుడూ రాజమ్మకి ద్రోహం చెయ్యలేదు. నేటివరకూ ఒక్క క్లాసూ తప్పలేదు. ఈ బి.య్యే. పరీక్షకి, గుడ్డి రాక్షసుడి ఒంటికన్నులా వుండే బుడ్డిదీపం దగ్గర "రేత్తిరి మలికోడి కూసే" దాకా చదివేవాడు. తన వయసు వాళ్ళకు కలిగే కోర్కెలు తనకి కలక్కుండా వాటి పీకనొక్కి చంపేశేడు. "నన్ను సబిన్స పెక్టరూ చెయ్యక్కర్లే సూపరెంటూ చెయ్యక్కర్లే. జీవితంలో ఈతుది

పరీక్ష నెగ్గించు భగవాన్" అని, చావుబతుకుల మధ్య తనకున్న ఒక్క తల్లినీ బతికించమనే ఎనిమిదేళ్ళ పిల్లలా దీనాతి దీనంగా ప్రార్థించేడు.

'పరీచ్చైతే సత్తుంని సివాఁచలం కొండకి అంపుతా" అన్న రాజమ్మ మొక్కు చెల్లిస్తానని ఒప్పుకున్నాడు. "మూడూళ్లు ముప్టెత్తి నీ కొండకొచ్చి జుట్టిచ్చేస్తా వెంకటేశ్వరా" అని తనూ మొక్కుకున్నాడు.

❖ ❖ ❖

మెదళ్ళో చిక్కుపడే ఆలోచనల్తో, తడితో చీకటిగా వున్న మేఘాలక్రింద, పొంచున్న పులుల్లా వున్న చెట్ల మధ్య, లేనిధైర్యం తెచ్చుకుంటూ, సాధ్యపడని సాహసాన్ని సాధిస్తూ నడిచిపోతున్నాడు సత్తెన్నారాయణ.

తడిసిన నల్ల తోలుముక్కలా తేలుతున్నాయి మేఘాలు.

రాక్షస సంతర్పణలో కూర్చున్న ముసలి రాక్షసుల్లా వున్నాయి రోడ్డు ప్రక్క చెట్లు.

మీదనున్న వాళ్ళ పాప భారానికి కుంగిపోయి చెయ్యెత్తితే అందేట్టుంది ఆకాశం.

రైలుస్టేషను చేరాక గుర్తొంచ్చింది సత్తెన్నారాయ ణకి, తను డబ్బు మరచిపోయేనని. "ఛీ! అపశకునం" అనుకుంటూ థర్డు క్లాస్ వెయిటింగ్ హాల్లో బెంచీమీద కూలబడి పోయేడు.

అప్పటికప్పుడే మెయిలొచ్చేసింది, సత్తెన్నారాయణ గుండెలా చప్పుడు చేస్తూ. గొంతులో కొట్టుకొనే గుండెతో, ఏ క్షణాన రక్తం వత్తిడికి పగిలి పోతాయో అని పించే నరాల్తో, భయానికి వంకర్లుపోయే ఎముకల్తో, ఆశ నిరాశల కత్తెర్లో తెగిపోతున్న హృదయంతో, తనకి తెలిసిన స్టూడెంట్లెవరైనా న్యూస్ పేపరు తెస్తారేమోనని ఎదురు చూస్తూ కూర్చున్నాడు సత్తెన్నారాయణ.

అతనికి తెలిసినవాళ్ళు చాలామంది చాలా పేపర్లు తెచ్చారు. "నీకేఁవిఁటోయ్! ఫస్ట్‌క్లాస్ కేండిడేటువి" అంటున్న ఒకడి దగ్గిర పేపరు పుచ్చుకున్నాడు. వణుకుతున్న చేతుల్తో పేజీలు తిరగేసి బెదిరిపోయే పేజీలు తిరగేసి, బెదిరిపోయే కళ్ళతో ఆత్రంగా చూసేడు. ఏవో అర్థంకాని నంబర్లు గుర్తులేని అంకెలు అతని కళ్ళముందు తిరిగి పోతున్నాయి.

ముగ్గురు దేవతలకూ కరుణ కలగలేదు.

ముక్కోటి దేవతలకూ కరుణ కలగలేదు.

సింహాద్రి అప్పన్న అంకెలు వేసేడు. భూదేవి, శ్రీదేవీ సమేతుడైన శ్రీనివాసునికి సత్తెన్నారాయణ జుట్టక్కర్లేక పోయింది.

సత్తెన్నారాయణ నంబరు పేపరులో లేదు.

❖ ❖ ❖

"ఎక్కడా తెలకుండా కుట్టేసినా దొరె డాట్రు- పెద్ద సెయ్యి" అన్నారు, అంతా మెయిల్‌కింద పీకపెట్టి చచ్చిపోయిన సత్తెన్నారాయణ శవాన్ని పంచాయితీ, పోస్టుమార్టమ్ ఎగ్జామినేషనూ అయ్యేక రాజమ్మకి యిచ్చినప్పుడు.

ఇది జరిగిన రెండు రోజులకు... విసిరేసిన ఎంగిలాకుల్లా పూరవతల వున్న రాజమ్మ గుడిసెలో.

ఏదో అడవిలో జీర్ణశిథిలాలయంలో అజ్ఞాత భక్తుడు వెలిగించిన దీపకళికలా వెలుగుతున్నది ప్రమిదలోని వత్తి.

ఎన్నో శతాబ్దాలు వెనక సుందరంగా మలచబడి ఎండపేల్చగా, వానచీల్చగా, గాలికోసేయగా మిగిలి, అన్య మతస్తుల చేత విరగ్గొట్టబడిన వికృత శిల్పంలా నేలని పడివుంది రాజమ్మ.

ఆర్నెల్లు ప్రతిరాత్రి నీట్లోనూ, పగలు ఎండలోనూ పెట్టిన పాత చెప్పులా వుందామె మొహం.

ఉడతలు పీకిపీకి వదలగా, ఎలకలు కొరికిన తాట్టెంకలా వుందామె జుట్టు.

బ్రతికుండగానే చెదలు తినేసినట్టుందామె శరీరం.

ఆమె గుడిశంతా తుప్పుపట్టిన ఇనపముక్కలా వుంది.

అర్ధరాత్రైనా ఆమె కంటికి నిద్రగాని, నీరుగాని రాలేదు. ఆతృతతో వచ్చిన రాంబాబుని చూసి కూడా ఆమె కదలేదు.

ఆనందంతో తొట్రుపడుతూ "మన సత్తెన్నారాయణ ప్యాసయేదు రాజమ్మా! పేసైపోయేడు" అని నిర్జీవంగా పడున్న రాజమ్మని చూసి ఒక్కసారి ఆగిపోయేడు రాంబాబు.

మళ్ళీ తనంత తానే ప్రారంభించేడు. "ఏదో తప్పైందిట- యూనివర్సిటీలోనే- అంటే కాలేజీ- పెద్దకాలేజీలోనే ఏదో పొరపాటై పోయిందిట. పొరపాటంతా వాళ్ళదే! ఇదుగో యిప్పుడే పేపర్లో పడింది చూడు రాజమ్మా... మన సత్తెం ప్యాసై పోయేడు- తప్పంతా వాళ్ళదే- ఆ కాలేజీ వాళ్ళదే, మనసత్తెం తప్పేమీలేదు రాజమ్మా" అని రాజమ్మ కదలడం చూసి హఠాత్తుగా ఆగిపోయేడు.

రాజమ్మ బయటకు చప్పుడయ్యే కీళ్ళతోలేచి గోడకి చేరబడి కూర్చుంది. బయటికి కనపడనంత లోతుగావున్న తన కళ్ళతో రాంబాబుని తీక్షణంగా చూసి "తప్పకుండా ఆడిదే బాబూ! ఆడిదే! ఆడిపుటకే... ఆదు పుట్టడవేఁ ఆడితప్పు" అని చూపు మరల్చి దూరంగా నిశీథంలోకి చూస్తూ "మాలాటోళ్ళని పుట్టిన్చ డవేఁ ఆడితప్పు" అంది చెయ్యెత్తి ఆకాశం వేపు చూపిస్తూ.

**(1968)**

# తీర్పు

నువ్వు నా దగ్గరికి రాకముందెక్కడికీ వెళ్ళలేదా? గుడ్. మంచిదే! ఏడు మనుముల ఎరకల్దాన్లాంటి వాణ్ని. నాకు బార్లో ముప్ఫై ఏళ్ళు పూర్తయి ఎన్నేళ్ళయ్యాయో చెప్పడానికి నే నిష్ట పడను. కష్టపడి కట్టలుమోస్తే ఎప్పటికైనా మేస్త్రీ ప్లీడరువవుతావు. తొందర పురోభివృద్ధికి శతృవు. కేస్ 'లా' బాగా చదువు. ఒక లా పాయింటు గురించి ఒక హైకోర్టు ఓలా అంటే, మరోటి మరోలా అంటుంది. పెళ్ళాం పిల్లల్ని కనాలా? వద్దా? అనడిగితే, కనాలని వొక హైకోర్టంటుంది. కనఖ్కర లేదని మరోటంటుంది. చేతనైతే మొగుణ్ణే కనమని మూడో దంటుంది.

నా చిన్నప్పుడొకడు బోలెడాస్తి తగలబెట్టేకుండా చచ్చేడు. ఆ ఆస్తి నాదంది వాడి కూతురు. అంటే తనదందే. కాదన్నాడు వాడి తమ్ముడు. ఏం అంటే అది వాడి కూతురుకాదు. కాక పోయినా దానమ్మ దాన్నాన్నని పెళ్ళాడలేదని మొండికెత్తేడు. బ్రతికున్నది చచ్చినవాడి కూతురా? కాదా అన్న పాయింటుమీద ముప్ఫైమంది సాక్షుల్ని విచారించి, ముత్తుస్వామయ్యరు ఆర్గు మెంట్‌విని, కూతురే అంది మొదటికోర్టు. అపీలెల్తే కాదన్నారో హైకోర్టు సింగిల్‌జడ్జీ. మళ్ళీ అపీలెల్తే ఔనన్నారిద్దరు జడ్జీలు.

అలా అని ఊరుకోకుండా దీనమ్మకి మొదట్లో ఇంకెవరి తోనేనా పెళ్ళయిందా లేదా అన్న పాయింటెవరూ చూళ్ళేదని, ఆ పాయింటు విచారించమని కిందికోర్టుకి రిమైండ్ చేశారు. కిందికోర్టు మరో పదిమందిని విచారించి పెళ్ళయిందంది. దాని మీద అపీలెల్తే దానమ్మకి అదివరకు పెళ్ళవలేదనే అన్నారు. మా క్లయింటు గెల్చుకుంది. కాని ఈ లోగా ఉట్టి ముసలిదై పోయింది. మూళ్ళక్ష లాస్తికి మూణ్నాలపరక మిగల్లేదు. దాని మొహం నేను చూడలేక పోయేవాణ్ణి. కాని అది మాత్రం వారా నికో అప్పడాలకట్ట ఇచ్చిపోయేది. ఆఖరికి అప్పడాలమ్ముకొనే బతికిందిలే.

ఇంకే సీనియర్ దగ్గర కెళ్ళినా ఇలాంటి పాతకాలం సలహా లివ్వవచ్చు. నువ్వు పట్టాపుచ్చుకొని పనికి రావాలనుకుంటే ఎలాగా పుస్తకాల పురుగు వవుతావు. కష్టపడతావు. ముందు కొస్తావు. నాకు సందేహం లేదు. ఇవన్నీ తుప్పట్టిన కబుర్లే.

నీకు తెలీంది. నీ కెవ్వరూ చెప్పందీమాత్రం ఒకటుంది. జడ్జీ మనస్తత్వంబట్టి పోవడం నేర్చుకోవాలి. దుర్యోధనుడే ఆయుధం తీస్తాడో ధర్మజుడికి ముందే తెలిసుండొచ్చు.

కాని జడ్జీ ఎప్పుడు ఏ అడ్డు పెడతాడో ముందుగా నీకు తెలీదు. చాలాసార్లు అతగాడికే తెలీదు.

"కాని మీవాడు పెళ్ళాన్నొదిలేశాడు. ఎలా నమ్మ మంటావ్, వాడి సాక్ష్యం?" అని నీకాళ్ళలో కర్రపెడతాడు. నీ కళ్ళల్లో కారం కొడతాడు. అంతవరకూ నీది స్ట్రాంగ్ కేస్ అనుకున్న నువ్వు నెత్తిన గుద్దేసుకోవాల్సిందే. నీ క్లయింటు అనుకున్న ధరకి బంగాళాదుంపలు కొంటానన్నా అవతలివాడు అమ్మకపోవ డానికీ, మీవాడు భార్య నొదిలెయ్యడానికిగల సంబంధం నీకు తెలీదు. అట్టే మాట్లాడితే జడ్జీకే తెలీదు. కాని నువ్వలా అన్లేవు. ఆ సంగతి నీకంటే జడ్జీకి బాగా తెలుసు.

నీ కేసు పోతుంది. నీకు నీరసం వస్తుంది. నవ్వు క్లబ్బు నుంచి ఆలస్యంగా వెళ్ళడానికి, అన్నం చల్లారి పోడానికి సంబం ధం నీకు తెలీదు. నీ పెళ్ళాన్నడుగు తావు. ఆవిడ చెబుతుంది. నిజం చెప్పినందుకు నువ్వు కోంబడతావు. అడిగేవాడికి చెప్పే వాడు లోకువ. నీ పెళ్ళాం నీకు లోకువ. నువ్వు జడ్జికి లోకువ.

ఇలా అంటున్నానని జడ్జీలకి మూడు చేతులూ, ముప్ఫై కాళ్ళూ, కొండజెర్రిలా ఉంటాయనుకోకు. వాళ్ళంతా నీలాంట్నా లాంటివాళ్ళే. చాలామంది నాకంటే మంచివాళ్ళు కూడా.

"వాళ్ళకి చెవులుంటాయేకాని కళ్ళుండవు. బుర్రుంటుంది కాని బుద్ధుండదు. గుండె ఉంటుందికాని దయుండదు" అని అంతా అనేమాటలు నేను అనను.

కాని నే ననేదిమాత్రం ఒకటే. వాళ్ళకి చాలా మామూలు విషయాలు అర్థంకావు. దానిక్కారణం వాళ్ళు కాకపోవచ్చు. పుట్టుకతో వచ్చిన గుణాలు మనం ఏం చేసినాపోవు. కాని, నా